క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సద్గురు సత్సంగం వారి నూతన సంవత్సర క్యాలెండర్‌ను చిట్టినగర్‌లోని సత్సంగం కన్వీనర్ అవ్వారు బుల్లాబ్బాయ్ కార్యాలయంలో సోమవారం ఆ సంఘ వ్యవస్థాపకులు మరడాన సాంబశివరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సయ్యద్ అప్పలస్వామి, కళాశాల మాజీ ప్రిన్సిపాల్ వుడతా వెంకట సుబ్బారావు, ఆచారి, ఎం.జేజిబాబు, సూర్యప్రకాష్, శివ పాల్గొన్నారు.

పెన్షన్ వారోత్సవాలు



వించిపేట(విజయవాడపశ్చిమ): స్థానిక 55వ డివిజన్‌లోని 171, 172, 173 సచివాలయాల పరిధిలో సోమవారం పెన్షన్ వారోత్సవాలు నిర్వహించారు. వించిపేట ఆరుపంపుల బావి సెంటర్లోని ఆయా సచివాలయాల్లో జరిగిన వారోత్సవాలలో స్థానిక కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణచంద్రరావు పాల్గొని నూతనంగా మంజూరైన 36 మంది లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే కొలమానంగా రాజకీయ, కుల, మతాలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు అందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు షేక్ స లీం, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుంటూరు ఘటనపై విచారణ జరపాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సంకాంత్రి కానుక, జనతా వస్త్రాలను పంపిణీ చేసేందుకు ఒక స్వచ్ఛంద సంస్థ ఆదివారం గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో ముగ్గురు చనిపోయిన సంఘటనపై నిష్పక్షపాతంగా పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు బొండా ఉమా కోరారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నిమ్మతోట సెంటర్ సమీపంలోని ఆయన ఇంటిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థ తన సొంత ఖర్చులతో సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ముఖ్యఅతిథిగా చంద్రబాబునాయుడిని ఆహ్వానించారని చెప్పారు. పోలీసుల వైఫల్యం కారణంగానే ఈ కార్యక్రమంలో ముగ్గురు చనిపోయారని ఆయన పేర్కొన్నారు. 25 వేల మంది పాల్గొన్న భారీ సభలో 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారని ఎస్పీ చెబుతున్నారన్నారు. అయితే అక్కడ కేవలం 25 మంది పోలీసులే విధులు నిర్వహించారని ఉమా చెప్పారు. ఇక నుంచి తెలుగుదేశం పార్టీ సమావేశాలే కాకుండా ఏ సమావేశాలపైన అయినా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి గుంటూరులో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు.

పరస్పర దాడులపై కేసుల నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇద్దరు యువకుల మధ్య చోటు చేసుకున్న వివాదంతో ఒకరిపై మరొకరు కర్రలు, పదునైన వస్తువుతో దాడికి పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కౌంటర్ కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వించిపేట సీఎస్ఐ చర్చి ప్రాంతానికి చెందిన గొల్లపూడి యాకోబు వరంగల్‌లో ఉద్యోగం చేస్తుంటాడు. ఆదివారం సెంటర్‌లోని ప్రశాంత్ షాపు వద్ద కూర్చుని ఉండగా, అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న యాకోబు దూరపు బంధువైన పలివెల విజయ్‌తో వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో విజయ్ కర్రతో యాకోబుపై దాడి చేశాడు. యాకోబు తన చేతికి అందిన పదునైన వస్తువుతో దాడి చేశాడు. దీంతో విజయ్ వీపుపైన బలమైన గాయం కావడంతో హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యాకోబుకు కూడా గాయం కావడంతో ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కౌంటర్ కేసులు నమోదు చేశారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 45వ డివిజన్ పరిధిలోని రాము క్వారీ కొండ ప్రాంతం, కొండబడి ఎదురు రోడ్డులో అభివృద్ధి పనులకు సోమవారం డివిజన్ వైఎస్సార్ సీపీ బాధ్యులు మైలవరపు కృష్ణ కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ రాము క్వారీ కొండపైకి వెళ్లే రోడ్డుతోపాటు సైడు డ్రెయిన్స్ నిర్మాణాలు, అలాగే డివిజన్ పరిధిలోని కొండబడి ఎదురు రోడ్‌లో కొండపైకి వెళ్లే మెట్లు ధ్వంసమై నడవటానికి ఇబ్బందులు పడుతుండటంతో స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్యను కలిసి తమ అవస్థలను వివరించారని తెలిపారు. దీంతో ఆమె వెంటనే సమస్యను స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు దృష్టికి తీసుకువెళ్లారని, తక్షణమే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారని కృష్ణ చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోటేశ్వరరావు, వాసు, నాగు, శివ, వాసు, లక్ష్మి, కిరణ్, వెంకట్రావు, కృష్ణ పాల్గొన్నారు.

వైకుంఠనాథా నమోస్తుతే

కిటకిటలాడిన ఆలయాలు



ఉత్తర ద్వార దర్శనం ఇచ్చిన స్వామి వారు

విజయవాడ కల్చరల్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం నగరంలోని ఆలయాలు కిటకిటలాడాయి. వైకుంఠనాథుని దర్శించుకునేందుకు ఉదయం ఐదుగంటలనుంచే క్యూలో వేచిఉన్నారు. వైకుంఠనాథా నమోస్తుతే అంటూ భక్తి పారవశ్యంలో మునిగి తరించిపోయారు.

టీటీడీ ఆధ్వర్యంలో.. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోట టీటీడీ కల్యాణమండపంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అంతరాలయ పూజలు అనంతరం భక్తులకు నిర్వాహకులు దర్శనానికి అనుమతించారు. దాదాపు 30 వేల మంది ఉత్తర ద్వార దర్శనంద్వారా స్వామిని దర్శించుకునట్లు టీటీడీ సూపరింటెండెంట్ రామచంద్రరావు తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, జస్టిస్ డి వెంకటరమణ, నగరపోలీస్ అధికారులు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ రవి కిరణ్, మహిళా పోలీస్ అధికారి ఉదయరాణి స్వామిని దర్శించుకున్నారు.

- లబ్బీపేట శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం నుంచే ఉత్సవ శోభ కనిపించింది. లబ్బీపేటలోని పిచ్చయ్యవీధి, పైడియ్యవీధి భక్తులతో నిండిపోయాయి. 20 వేలమంది స్వామిని దర్శించుకున్నారని ఆలయ మేనేజర్ శర్మ తెలిపారు. ధనుర్మాసం సందర్భంగా రంగనాథుడు గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామకోటి: దుర్గాపురంలోని రామకోటిలో వైకుంఠ ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. గోదాదేవి సమేత రంగనాథుడు, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వన్‌టౌన్‌లోని వైష్ణవాలయాలన్నీ సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. శ్రీమన్నారాయణుడి దర్శనం కోసం భక్తులు గంటల కొద్ది క్యూలో బారులు తీరారు. అన్ని వైష్ణవాలయాల్లో స్వామి వార్లను ఉత్తర ద్వారం గుండా దర్శనం చేసుకునేందుకు వీలుగా ఆయా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో..

వన్‌టౌన్‌లోని చారిత్రిక ఆలయమైన బ్రాహ్మణవీధిలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు వేలాదిగా తరలివచ్చారు. గరుడవాహనరూఢుడై వైకుంఠ ద్వారం ద్వారా స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం స్వామి గరుడవాహనంపై నగరవీధుల్లో విహరించారు. సాయంత్రం తిరుప్పావై పారాయణం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయం వద్ద ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్‌బాబు ఏర్పాట్లు చేశారు.



స్వామి వారికి వజ్రకవచంతో విశేష అలంకరణ

కొత్తగుళ్ల ప్రాంగణంలో..

కొత్తగుళ్ల ప్రాంగణంలోని కోదండరామాలయంలో స్వామి సీతాలక్ష్మణ సమేతంగా ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలోని రజిత హనుమత్ వాహనంపై రుక్మాబాయి సమేత పాండురంగడు కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చక స్వాములు పులిపాక రాఘవాచార్యులు పూజలను పర్యవేక్షించారు.

నగరాల సీతారామస్వామి ఆలయంలో..

కొత్తపేటలోని శ్రీ నగరాల సీతారామస్వామి ఆలయంలో సీతా లక్ష్మణ సమేత శ్రీ రామచంద్రుడిని దర్శించుకునేందుకు సోమవారం భక్తులు బారులు తీరారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ పాలకవర్గం మరుపిళ్ల హనుమంతరావు, పిళ్లా శ్రీనివాసరావు, సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోదండరామస్వామి దేవస్థానంలో..

భావనారాయణవీధిలోని కోదండరామస్వామి వారి దేవస్థానంలో స్వామిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

పాతశివాలయంలో..

భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం)లోని శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి సోమవారం ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. గరుడ వాహనంపై స్వామిని అధిష్ఠింపజేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి హేమలతాదేవి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తజనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామిని ఉత్తర ద్వారంలో దర్శించుకునేందుకు సోమవారం భక్తులు పోటెత్తారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని స్వామి వారికి వజ్ర కవచాన్ని అలంకరించారు. ఉట్టి విష్ణువర్ధన్ అనే భక్తుడు స్వామికి వజ్ర కవచాన్ని బహూకరించారు. ఏడీసీపీ క్రైం వెంకటరత్నం స్వామిని దర్శించుకున్నారు. తొలుత వెంకటరత్నంకు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, హనుమంతరావు స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం జ్ఞాపికను, ప్రసాదాలను కమిటీ కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావులు అందజేశారు. కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం స్వామిని దర్శించుకున్నారు.

స్వామి దర్శనానికి బారులు

స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో క్యూలైన్ టేనర్‌పేట అడ్డరోడ్డు వరకు చేరుకుంది. సర్వ దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. సాయంత్రం స్వామి నగరోత్సవ సేవ కన్నుల పండువగా జరిగింది. కార్యక్రమంలో పాలక కమిటీ సభ్యులు పోతిన వెంకట ధర్మారావు, మజ్జి శ్రీనివాసరావు, మజ్జి ఈశ్వరరావు, ఈది ఎల్లారావు, తమ్మిన సూర్యకుమారి పాల్గొన్నారు.

ఊర్మిళా సుబ్బారావునగర్‌లో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఊర్మిళా సుబ్బారావునగర్ గ్రామ దేవత పోలేరమ్మ దేవస్థానంలో సోమవారం సీతారామ లక్ష్మణుల విగ్రహాలను ఉత్తర దిశగా ఏర్పాటు చేశారు. భక్తులు పోలేమ్మతోపాటు స్వామివార్లనుకూడా దర్శించుకున్నారు. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యాధరపురం గురుకృప రోడ్డులో శ్రీఅష్టాక్షరీ ఆశ్రమంలో ఉత్తర ద్వార దర్శనం ఇచ్చిన స్వామిని భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు. కమిటీ అధ్యక్ష,,కార్యదర్శులు సీహెచ్ జనార్ధనరావు, ఇన్నమూరి సత్యనారాయణ, పోలేపల్లి బదరీనాథ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. విద్యాధరపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉత్తర దర్శనమిచ్చిన శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. కార్యనిర్వాహక వర్గం అధ్యక్ష, కార్యదర్శులు సుంకు శ్రీరాములు, మేడం మల్లికార్జునరావు, కోశాధికారి మొగుళ్లూరి కృష్ణమోహనరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లో దాసాంజనేయ స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం కోసం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక అలంకారం చేశారు. ఆలయ పూజారి మునుకుట్ల శారద ప్రసాద్ పూజాధికాలు నిర్వహించారు. కమిటీ సభ్యులు గుంటుపల్లి నాగేశ్వరరావు, ఉడుముల తిరుపతిరెడ్డి, వినుకొండ మాలకొండయ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు.



చందన అలంకారంలో దర్శనమిస్తున్న కొత్తగుళ్లు కోదండరాముని మూలమూర్తులు



స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు



ఆర్టీసీ వర్క్‌షాప్‌లో దాసాంజనేయ స్వామి మందిరంలో



రజిత హనుమత్ వాహనంపై దర్శనమిస్తున్న పాండురంగడు



శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో రజిత గరుడ వాహనంపై ఉభయదేవేరులతో స్వామివారు



కోదండరామాలయంలో ఉత్తర ద్వారంలో దర్శనమిస్తున్న స్వామి



ఊర్మిళానగర్ పోలేరమ్మ గుడిలో



అష్టాక్షరి ఆశ్రమంలోని శ్రీవారి మందిరంలో



నగరోత్సవంలో ఊరేగుతున్న కొత్తపేట నగరాల సీతారామస్వామి



పండితుల ఆశీర్వాదం అందుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి దంపతులు



రామకోటిలోని సర్వాభరణ భూషితులైన ఉత్సవ మూర్తులు



శ్రీవారి సన్నిధిలో బారులు తీరిన భక్తులు

నైపుణ్యాలను పెంపొందించే విధంగా విద్యా బోధన

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించే విధంగా విద్యా బోధన ఉండాలని ఎన్టీయార్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. సోమవారం ఆయన పటమటలోని కోనేరు బసవయ్య బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలోల 9,10 విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుపట్ల శ్రద్ధ కనబరచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. 10వ తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదల అయినందున విద్యార్థులు మరింత శ్రద్ధగా చదివి పాఠ్యాంశాలపై పట్టు సాధించాలన్నారు. చేతిరాతను మరింత మెరుగుపరచుకోవాలని సూచించారు. బాగా చదువుకుంటే భవిష్యత్‌లో పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలలకంటే మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని, క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో బోధన జరుగుతుందని, ఇంగ్లిష్, తెలుగు భాషపై పట్టుసాధించాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యేరీతితో బోధన ఉండాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచించారు. రానున్న రెండు నెలలు కీలకమని, పరీక్షలు దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు ప్రణాళికబద్ధంగా, ఏకాగ్రతతో చదువుకుని గ్రేడ్ మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

తండ్రి అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పనికి వెళ్లిన తన తండ్రి కనిపించడం లేదంటూ కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు గొల్లపాలెంగట్టు కొండ ప్రాంతానికి చెందిన బూస పైడిరెడ్డి కాశేశ్వరరావు మార్కెట్‌లో కూరగాయలు అమ్ముతుంటాడు. పైడిరెడ్డి తండ్రి బంగారాజు రిక్షా బండి తొక్కుతుంటాడు. అప్పుడప్పుడు బయట పనులకు వెళుతుంటాడు. రెండు నెలల కిందట పనికి వెళ్లుతున్నానని చెప్పి వెళ్లిన బంగారాజు ఇంత వరకు తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సంక్షేమ పథకాలను అమలు చేయటంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు అన్నారు. 53వ డివిజన్ పరిధిలోని 179వ సచివాలయం పరిధిలో నూతనంగా మంజూరైన పెన్షన్లను అప్పాజీరావు స్థానిక పెద్దలతో కలిసి లబ్ధిదారులకు సోమవారం అందజేశారు కార్యక్రమంలో సచివాలయం అధికారులు వెంకటలక్ష్మి, యుసఫ్, అలేఖ్య, రబ్బానీ, స్థానిక నాయకులు అరసవల్లి కంచిబాబు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ పేషెంట్‌కు పెన్షన్ మంజూరు

51వ డివిజన్‌లోని 165వ సచివాలయం పరిధిలో పోతిన అదెయ్య వారి వీధిలో నివాసముంటున్న విజ్జి శ్రీనివాసరావు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. డయాలసిస్ చేయించుకుంటూ పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి మంజూరైన పది వేల పెన్షన్‌ను స్థానిక కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ సోమవారం ఆయన ఇంటికి వెళ్లి అందించారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శులు శ్రీనివాసరావు, వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పెన్షన్లను అందిస్తున్న కార్పొరేటర్ అప్పాజీరావు, 85-పెన్షన్ అందిస్తున్న కార్పొరేటర్ రాజేష్

రేపు ఉచిత క్యాటరాక్ట్ స్క్రీనింగ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): అంధుల లిపి ప్రదాత లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 4వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు వన్‌టౌన్ బీఆర్‌పీ రోడ్, ఇస్లాంపేట వద్దగల అయాన్ కంటి హాస్పిటల్‌లో ఉచిత క్యాటరాక్ట్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు హాస్పిటల్ ఆప్టోమెట్రిస్ట్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. 40 ఏళ్లపైబడి, కళ్లు మసకగా ఉండి స్పష్టంగా చూడలేని వారికి మాత్రమే ఈ ఉచిత శిబిరంలో ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో శుక్లాల నిర్ధారణ జరిగిన పేషెంట్లు, అధునాతన లేజర్ శస్త్ర చికిత్సకు ఎంపికై సర్జరీ తేదీని కూడా అప్పుడే నిర్ణయించుకోవచ్చని తెలిపారు. శస్త్ర చికిత్సలో విశేష రాయితీ, అన్ని రకాల ఇన్‌స్రూ అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. శుక్లాల లేజర్ శస్త్ర చికిత్స గురించి 98857 17773లో సంప్రదించవచ్చని కోరారు.

స్పందన అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలపై వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పునరావృత్తం కాకుండా వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు సూచించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం జరిగిన స్పందనలో నగరవాసుల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు సిబ్బంది అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. స్పందనలో మొత్తం తొమ్మిది అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (జనరల్) ఎం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, పట్టణ ప్రణాళిక విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి) శకుంతల, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ కె.బి.ఎన్.ఎస్ లతా, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాసు, మేనేజర్ బి.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

మైలపల్లి పోలీస్ స్కూల్ ఆవరణలో డీఎస్ఎమ్ హైస్కూల్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం మారయ్య హోటల్ సెంటర్‌లోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్ సమీపంలోని తుళ్లూరివారి వీధిలోగల మైలపల్లి పోలీస్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గతంలో నిర్మించిన అదనపు తరగతి గదుల భవనంలోకి తరలి వెళ్లింది. ఈ భవనాన్ని సోమవారం 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిన్నటి వరకు ఉన్న స్కూల్ భవనం రహదారి కంటే లోతట్టులో ఉన్న కారణంగా దాన్ని పూర్తిగా తొలగించి రూ.3 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించనున్నారని తెలిపారు. అప్పటి వరకు ఈ అదనపు తరగతి గదుల భవనంలో స్కూల్ నడుపుతారని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్ఎమ్ హైస్కూల్ హెచ్ఎమ్ మాతంగి కోటయ్య, మైలపల్లి పోలీస్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎమ్ కొడాలి కిషోర్, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తున్న చంద్రబాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): చరిత్రను వక్రీకరిస్తూ అబద్ధాలు చెప్పడం చంద్రబాబుకు అలవాటైందని కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతపల్లి దాసు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు ఇటీవల జరిగిన సభల్లో ఎన్టీఆర్ ప్రభుత్వంలో రూ.30 పెన్షన్ ఇచ్చారని చెప్పటం పూర్తిగా అవాస్తవమని తెలిపారు. రూ.30పింఛన్‌ను 1978లో నాటి సీఎం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ప్రవేశపెట్టారని, ఆయన కేబినెట్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబులు మంత్రులుగా ఉన్నారని గుర్తు చేశారు. తాను ఏం చెప్పినా ప్రజలు నమ్మేస్తారని చంద్రబాబు భావిస్తే పొరపాటని, ఆయన మాటలను విని తనలాంటి సీనియర్ సిటిజన్స్ నవ్వుకుంటున్నారని తెలిపారు.

ఆటో చోరీపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): షాపు ముందు పెట్టిన ఆటో చోరీకి గురైన ఘటనపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు జక్కంపూడి కాలనీకి చెందిన ఆకిన రాజు ఎలక్ట్రికల్ షాపు నడుపుతుంటాడు. షాపుతో పాటు రెండు ఆటోలను కొనుగోలు చేసి, వాటిపై ఉల్లిపాయలను విక్రయిస్తుంటాడు. 31వ తేదీ రాత్రి ఆటోలను తన షాపు ముందు పెట్టి తాళం వేశాడు. ఆదివారం ఉదయానికి షాపు ముందు పెట్టిన ఆటో చోరీకి గురి కావడంతో చుట్టు పక్కల వెతికినా ఫలితం లేదు. దీంతో బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.